# ఆర్టీసీ బస్సు షెల్టర్ ఆక్రమణపై ఫిర్యాదులు..

# పట్టించుకోని అధికారులు?



**ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన షెల్టర్ భవన నిర్మాణానికి వినియోగం?**
**ఫిర్యాదులు చేసినా చర్యలు లేవని స్థానికుల ఆరోపణ**

**వేటపాలెం, సెప్టెంబర్ 2 (పెన్ పవర్):**
వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ పరిధిలోని ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సు షెల్టర్ ఆక్రమణకు గురైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ షెల్టర్‌ను సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న భవనానికి సంబంధించిన వారు తమ అవసరాలకు వినియోగించుకుంటున్నారని వారు పేర్కొంటున్నారు. షెల్టర్ పరిధిలో శాశ్వత గోడ నిర్మాణం చేపడుతున్నట్లు ఆరోపణలు రావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.ఈ విషయంపై పలువురు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు సమస్యపై తగిన చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా పంచాయతీ పరిధిలోని ప్రజా ఆస్తుల పరిరక్షణపై అధికారులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.ప్రజా వినియోగం కోసం ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్ విషయంలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, ఆక్రమణ జరిగినట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే ప్రయాణికులకు బస్సు షెల్టర్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# 'ఇంటింటికి కూటమి ప్రభుత్వం'కు

## రికార్డు ఎమ్మెల్యే గళ్ళా మాధవి




**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 2**
గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని 83,638 గృహాల్లో సుమారు 90 శాతం ఇళ్లను సందర్శించి, కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలు, సూచనలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు చెప్పారు.
టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల గ్రీవెన్స్ కార్యక్రమంలో అర్జీలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని గళ్ళా మాధవి తెలిపారు.

# శారదా ఉన్నత పాఠశాలలో ఘనంగా 'చెకుముకి' సైన్స్ సంబరాలు



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 02 :**
చిలకలూరిపేట: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్షను ఘనంగా నిర్వహించారు. ఈ పరీక్షకు 8, 9, 10 తరగతులకు చెందిన దాదాపు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేవీవీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 240 పాఠశాలల్లో సుమారు 15 వేల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారని తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విజేతలకు ఈ నెల 11న స్థానిక సాధినేని చౌదరయ్య హేలోస్ పాఠశాలలో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి, సైన్స్ ఉపాధ్యాయులు వై. శ్రీనివాసరావు, జేవీవీ ప్రతినిధులు డాక్టర్ పీవీ సుబ్బారావు, కేబీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# క్రెడిట్ చోరీ అంటూ మీ ఏడుపులు. విమర్శలు, ప్రతి విమర్శలు.జగన్మోహన్ రెడ్డి



**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 2**
కేవలం శిలాఫలకం వేశాడు, మొత్తం మేమే అంటే, రాజశేఖరరెడ్డి, జగన్మోహన్ రెడ్డి రెడ్డి మాత్రమే చేసాము, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిసరంత చేసి, కొండత చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నాడు అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏడుపు.జగన్మోహన్ రెడ్డి నీకు నేను లక్ష్మయ్య సూటి ప్రశ్న. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి నీ తండ్రి కానీ, నువ్వు కానీ, లేదా ముఖ్యమంత్రి చంద్రబాబు కానీ, సొంత సొమ్ములు మీ జేబులో నుంచి తీసి ఖర్చు పెట్టలేదు కదా? అది ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రజలు కట్టిన పన్నుల సొమ్ము నుంచి, మరలా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రజల కోసం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు (ఉమ్మడి, విభజిత) చేసిన నిర్మాణాలు. అయితే ఇక్కడ జరిగిన యాదృచ్ఛిక ఘటన ఏమిటంటే, ఎవరి హయంలో శిలాఫలకం వేసి నిర్మాణానికి కొబ్బరి కాయ కొట్టారో, నేడు అదే వ్యక్తి మరలా కొబ్బరి కాయ కొట్టి, మొదటి దశ పూర్తి చేసి, జాతికి అంకితం చేయటం. అంటే, ఒక వ్యక్తి కన్న కల నెరవేరిన సందర్భం. అంతవరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి కీర్తి ఇవ్వాల్సిందే.అలాగే, రేపు పోలవరం మొదటి దశ పూర్తి అయితే, కల గన్న రాజశేఖరరెడ్డి, తరువాత దానిని కొనసాగిస్తూ, మొదటి దశ పూర్తి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి కీర్తి దక్కాలని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ. ఒకరి సమయంలో ప్రారంభం అయ్యి, మరొకరి సమయంలో పూర్తి అవుతుంది. కాకపోతే, ఇక్కడ ప్రారంభం చేసిన వ్యక్తే, మొదటి దశ ముగించటం కాకతాళీయం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసుకున్న అదృష్టం, ఆయనను ప్రజలు నమ్మటం వలన ఇది సాకారం అయ్యిందని లక్ష్మయ్య అన్నారు,మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డినువ్వు ఉన్న ఐదు సంవత్సరాలలో పీకింది ఏమి లేదు. నాటకీయ, ఉత్తుత్తి జాతి అంకితం కీర్తి కావాలంటే, తీసుకో. సంతోషంగా ఇచ్చేస్తాను ఉత్తుత్తి పనులు చేసినందుకు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు

## వైఎస్సార్‌కు ఘన నివాళులు

**- 17వ వర్ధంతి సందర్భంగా కాంస్య విగ్రహానికి పూలమాల వేసిన వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు**
**- గడియార స్తంభం సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు**



**చీరాల, సెప్టెంబర్ 2 (పెన్ పవర్):**
దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని చీరాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నివాళు లర్పించారు. చీరాల మున్సిపాలిటీ పరిధిలోని గడియార స్తంభం సెంటర్‌లో ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంస్య విగ్రహానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా వైఎస్సార్ సేవలను, ఆయన ముఖ్యమంత్రిగా చేపట్టిన వివిధ సంక్షేమ కార్యక్రమాలను నాయకులు స్మరించుకున్నారు. ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ అందించిన సేవలను కొనియాడారు.
కార్యక్రమంలో బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, చీరాల నియోజకవర్గంలోని అనుబంధ విభాగాల అధ్యక్షులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# చీరాల 10వ వార్డులో పోలీసుల ముమ్మర ఫుట్ పెట్రోలింగ్

**-నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ సోమశేఖర్ పిలుపు**
**- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**



**చీరాల, సెప్టెంబర్ 2 (పెన్ పవర్):**
రాబోయే ఎన్నికల నేపథ్యంలో చీరాల పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ముమ్మర భద్రతా చర్యలు చేపట్టారు. బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు చీరాల వన్‌టౌన్ సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని 10వ వార్డు ఉడ్‌నగర్ చర్చ్ కాంపౌండ్ పరిధిలో పోలీసులు విస్తృతంగా ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు.
వన్‌టౌన్ పోలీసు సిబ్బందితో కలిసి సీఐ సోమశేఖర్ వార్డులోని ప్రధాన వీధులు, సమస్యాత్మక ప్రాంతాల్లో కాలినడకన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఎన్నికల సమయంలో ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు భరోసా కల్పించారు.
ఈ సందర్భంగా సీఐ సోమశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
వార్డుల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే డయల్ 112కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఫుట్ పెట్రోలింగ్‌లో వన్‌టౌన్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం..

## నరసరావుపేటలో పసుపు జోరు
## ఎమ్మెల్యే చదలవాడ సారధ్యంలో
## వేలాది మందితో భారీ ర్యాలీ





**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబరు 02 :**
రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి, టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ నరసరావుపేట పర్యటన సందర్భంగా బుధవారం టీడీపీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. ఎస్ఆర్‌కేటీ కాలనీ బైపాస్ నుంచి మల్లమ్మ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా కాకాని జేఎన్‌టీయూ వరకు సాగిన ర్యాలీలో వేలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. దీంతో నరసరావుపేట ప్రధాన రహదారులు పసుపుమయంగా మారాయి. మంత్రి నారా లోకేష్‌కు నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ర్యాలీ మార్గంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి లోకేష్‌కు స్వాగతం పలికారు. పలుచోట్ల పూలవర్షం కురిపించారు. భారీగా జనసమీకరణ చేసి ర్యాలీని విజయవంతం చేసిన ఎమ్మెల్యే అరవిందబాబుకు కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు. ర్యాలీలో పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, గురజాల ఎమ్మెల్యే ఎరపతినేని శ్రీనివాసరావు తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం కాకాని జేఎన్‌టీయూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ క్యాంపస్‌లో సుమారు రూ.70 కోట్లతో నిర్మించిన (కావేరి, గౌతమి) బాలుర, బాలికల హాస్టల్ భవనాలతో పాటు డైనింగ్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. మంత్రి పర్యటనకు సంబంధించి జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. జిల్లా సంయుక్త కలెక్టర్ సంజనా సింహా, ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, జేఎన్‌టీయూ యూనివర్సిటీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ జాన్ సైదా, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఏపీ ఐటీ శాఖ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ, ఏపీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చదలవాడ కృషితో జేఎన్‌టీయూకేలో హాస్టల్ భవనాలకు మోక్షం







**- రూ.70 కోట్లతో 1,600 మంది విద్యార్థులకు వసతి**
**- మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ప్రారంభం**

**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 02:**
నరసరావుపేట మండలం కాకాని గ్రామంలోని జేఎన్‌టీయూకే యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన హాస్టల్ భవనాల నిర్మాణం పూర్తికావడంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేసిన నిరంతర కృషి ఫలించింది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో రూ.70 కోట్ల వ్యయంతో నిర్మించిన గౌతమి, కృష్ణవేణి, నాగార్జున నూతన హాస్టల్ భవనాలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభించారు. జేఎన్‌టీయూకే కళాశాలలో విద్యార్థులకు అవసరమైన వసతి సౌకర్యాల కోసం గతంలో ప్రారంభమైన హాస్టల్ భవనాల నిర్మాణం నిధుల కొరతతో అసంపూర్తిగా నిలిచిపోయింది. ఈ అంశాన్ని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లను కలిసి హాస్టల్ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని వినతిపత్రాలు సమర్పించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఈ అంశాన్ని ఎమ్మెల్యే పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో నిధుల మంజూరుకు చర్యలు చేపట్టారు. దీంతో నిలిచిపోయిన నిర్మాణ పనులు తిరిగి కొనసాగి, నేడు విద్యార్థుల వినియోగంలోకి వచ్చాయి. పట్టుదలతో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేసిన ఎమ్మెల్యే అరవిందబాబు ప్రయత్నాలకు ఈ హాస్టల్ భవనాల ప్రారంభం ఫలితంగా నిలిచింది. రూ.70 కోట్ల వ్యయంతో నిర్మించిన మూడు హాస్టళ్లలో సుమారు 1,600 మంది విద్యార్థినీ, విద్యార్థులకు వసతి కల్పించేలా ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవం అనంతరం మంత్రి నారా లోకేష్ హాస్టల్ భవనాలను పరిశీలించి విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను తెలుసుకున్నారు. కళాశాలకు చేరుకున్న మంత్రి లోకేష్‌కు కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి హాస్టల్ భవనాలను ప్రారంభించారు.
కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ వి.సంజనా సిమ్హా, జేఎన్‌టీయూకే వైస్ ఛాన్సలర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ, మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వాడవాడలా ఘనంగా ఉపముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 2తెలుగుచలన చిత్రరంగంలో అభిమానుల గుండెలను దోచుకున్న నటుడిగా, ఆలోచనల్లో కదిలే తత్వవేత్తగా, ప్రజల కష్టాల్లో పాలుపంచుకునే నాయకుడిగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జీవితం ఆదర్శప్రాయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక పాత గుంటూరు రామ్మూర్తి వృద్ధాశ్రమంలో, ఎన్టీఆర్ బస్టాండ్ వద్ద ఇస్రాయిల్ పేట మెయిన్ రోడ్డులో, పాత గుంటూరు కాపు కళ్యాణ మండపంలో, నెహ్రూనగర్ 6వ లైన్ లో కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ అంటే ప్రశ్నించే గొంతుక అని తెలిపారు. తుపానులా దూసుకొచ్చే వ్యక్తిత్వం వెనుక ఎంతో నిశ్శబ్దమైన తపన ఉందని చెప్పారు. ఆయన వెండితెరపై ప్రదర్శించిన ఉద్వేగాలు లక్షలాది గుండెల్లో ఉత్సాహాన్ని నింపుతాయన్నారు. పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయాలు ప్రజల భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంచాయని చెప్పారు. నాయకత్వం అంటే నిరంతర బాధ్యత అని చాటుతూ ముందుకు సాగుతున్న ఆయన అడుగుల్లో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ఓటములు ఎదురైనా అధైర్యపడకుండా, సిద్ధాంతాలకే కట్టుబడి నిలబడిన ఆయన ధైర్యం, నిబద్ధత ఈ రోజు ఆయనను ప్రజా నాయకుడిగా నిలబెట్టాయని తెలిపారు. రైతుల సమస్యలు, యువత ఉపాధి, మహిళల రక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం పవన్ కళ్యాణ్ పడ్డ తపన, చూపిన చొరవ అభినందనీయమన్నారు. రాష్ట్రంలో డిప్యూటీ స్పీకర్ పవన్ కళ్యాణ్ ప్రస్తానం ఉన్నతమని చెప్పారు. రాష్ట్ర ప్రగతి కోసం సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి పవన్ కళ్యాణ్ వేసిన అడుగులు ఎంతో కీలకమని తెలిపారు.

## పల్నాడు విద్యా అభివృద్ధికి మరో అడుగు.. జేఎన్‌టీయూకేకు యూనివర్సిటీ హోదా కోరిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబరు 02 :**
పల్నాడు జిల్లాలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా నరసరావుపేట మండలం కాకాని గ్రామంలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో రూ.70 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన గౌతమి, కృష్ణవేణి, నాగార్జున విద్యార్థి వసతి గృహాలను మంత్రి నారా లోకేష్ ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. దేశంలోకి వస్తున్న పెట్టుబడుల్లో గణనీయమైన వాటా ఆంధ్రప్రదేశ్‌కు రావడం రాష్ట్ర ప్రభుత్వ సమర్థ నాయకత్వానికి నిదర్శనమని అన్నారు.విద్యాశాఖ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు ఉపాధ్యాయులకు నాణ్యమైన శిక్షణ అందించి విద్యా ప్రమాణాలను పెంచుతున్నారని మంత్రి లోకేష్‌ను




ఎంపీ అభినందించారు. జేఎన్‌టీయూకేకు యూనివర్సిటీ హోదా కల్పించాలినరసరావుపేటలోని జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాలను మరింత విస్తరించి పూర్తిస్థాయి యూనివర్సిటీగా అభివృద్ధి చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మంత్రి నారా లోకేష్‌ను కోరారు. యూనివర్సిటీ హోదా కల్పించడం ద్వారా పల్నాడు జిల్లా విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు మరింత విస్తరించనున్నాయని తెలిపారు. అలాగే స్థానిక పారిశ్రామిక శిక్షణా సంస్థ భవనం సిద్ధంగా ఉన్న నేపథ్యంలో అవసరమైన సిబ్బందిని కేటాయించి తరగతులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కృషి కొనసాగుతుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.


# పేటలో హరితవనం

### ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబును మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నేత మండలనేని చరణ్ తేజ



చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 02 :
చిలకలూరిపేట పట్టణంలోని ఆర్వీఎస్ సీవీఎస్ హైస్కూల్‌లో నిర్వహించిన 'హరితవనం' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హరిత కార్య నిర్వహణ ఛైర్మన్, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ముఖ్య అతిథిగా పాల్గొని పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం స్థానిక శాసనసభ్యులు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు నివాసానికి విచ్చేసిన నాగబాబును నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు మండలనేని చరణ్ తేజ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు.
ఈ సందర్భంగా కొణిదెల నాగబాబుతో మండలనేని చరణ్ తేజ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న హరిత కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో జనసేన శ్రేణులు చురుగ్గా పాల్గొనాలని నాగబాబు సూచించగా, నియోజకవర్గంలో పచ్చదనం పెంపునకు, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని చరణ్ తేజ తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు







- నరసరావుపేటలో జనసేన శ్రేణుల ఉత్సాహం
- జనసేన అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు నరసరావుపేటలో ఘనంగా నిర్వహణ.

**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబరు 02 :**
జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు బుధవారం నరసరావుపేట పట్టణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఇస్సపాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో పవన్ కళ్యాణ్ ఆరోగ్యం చక్కగా ఉండాలని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో కొనసాగాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని ఆధ్వర్యంలో జనసైనికులు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఆలయం నుండి జనసేన పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పార్టీ జెండాలు, నినాదాలతో జనసైనికులు ఉత్సాహంగా పాల్గొని పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.
అనంతరం నరసరావుపేటకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు సయ్యద్ జిలాని, జనసైనికులు ఘన స్వాగతం పలికారు. తరువాత జనసేన పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, వీర మహిళల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.
కార్యాలయంలో ఏర్పాటు చేసిన భారీ ఎల్‌ఈడీ తెర ద్వారా రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారంగా వీక్షించారు. ఈ సందర్భంగా జనసేన యువజన విభాగానికి జై కొట్టు జనసేన యూత్ వింగ్ గా నామకరణం చేసిన విషయాన్ని నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు.
అనంతరం 60 అడుగుల రోడ్డులోని వృద్ధాశ్రమంలో నివసిస్తున్న అనాథలకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే కోటప్పకొండ హైవే సమీపంలో ఇంజినీరింగ్ విద్యార్థులు ఏర్పాటు చేసిన కేక్ కార్యక్రమంలో పాల్గొని జన్మదిన వేడుకలను జరిపారు. పట్టణంలోని పలు వార్డుల్లో అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమాల్లో పాల్గొని పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ డైరెక్టర్ వీరవల్లి వంశీ, రొంపిచర్ల మండల అధ్యక్షుడు అచ్చుల సాంబశివరావు, అధికార ప్రతినిధి ఎస్‌కే అద్రూఫ్, చెన్నుపల్లి సాంబశివరావు, ఆర్‌కే యాదవ్, నక్క గురునాథ్ ఘోష్, కృష్ణం శెట్టి, మదిరే ఖాజా, ఏడుకొండలు, మేడిశెట్టి రామారావు, ఆర్‌కే రామకృష్ణ, వాసు, నాగుల్ మీరా, మహబూబ్ సుభాని, ఖాజావలి, మధు, సయ్యద్ బాజీ, పెద్దబ్బాయి, టెడ్ల వెంకటేశ్వర్లు, విజయ్, బాషా, బాలకృష్ణ, హర్షవర్ధన్, ఇంకొల్లు నాగరాజు, ఇమ్రాన్, అంబటి రేణుక, జక్కా నిర్మలతో పాటు జనసైనికులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ

### - మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపు

### - ఆమంచి స్వాములు ఆధ్వర్యంలో కేక్ కటింగ్.. భారీగా తరలివచ్చిన జనసేన శ్రేణులు



**చీరాల, సెప్టెంబర్ 2 (పెన్ పవర్):**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ 55వ జన్మదినాన్ని పురస్కరించుకుని చీరాల నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు ఆమంచి స్వాములు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా, సామాజిక కార్యక్రమాలను చేపట్టి పవన్ కళ్యాణ్‌పై తమ అభిమానాన్ని చాటుకున్నారు. వేడుకల్లో భాగంగా తొలుత ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలో జనసేన నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులు సూచించారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు.అనంతరం చీరాల గడియార స్తంభం సెంటర్‌లో జనసేన పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆమంచి స్వాములు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ప్రజా సేవ, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పార్టీ శ్రేణులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్‌కు ప్రజల తరఫున, జనసేన పార్టీ శ్రేణుల తరఫున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని చీరాల నియోజకవర్గంలో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వేడుకలు సందడిగా సాగాయి. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

## జనసేన శ్రేణుల సందడిలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

### చీరాలలో ఘనంగా బైక్ ర్యాలీ.

### . 'జై కొట్టు' లోగో ఆవిష్కరణ

చీరాల సెప్టెంబర్ 2 (పెన్ పవర్):
జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను చీరాల నియోజకవర్గంలో జనసేన పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు, శ్రీశైలం దేవస్థానం పాలకమండలి సభ్యుడు ఆలా అనిల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జనసైనికులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.
ముందుగా చీరాలలోని ప్రసాద్ థియేటర్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జనసైనికులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా ముక్కోణ పార్కు సెంటర్‌కు చేరుకుని అక్కడి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
అనంతరం ముక్కోణ పార్కు సెంటర్ నుంచి గడియార స్తంభం సెంటర్ మీదుగా ముంతవారి సెంటర్‌లోని సప్తగిరి లాడ్జింగ్ ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. అక్కడ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎల్‌ఈడీ తెరపై ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తూ



జనసైనికులు, అభిమానులు కలిసి 'జై కొట్టు' కార్యక్రమ లోగోను ఆవిష్కరించారు. అనంతరం జనసేన పార్టీ ముఖ్య నాయకుడు నాదెండ్ల మనోహర్ సందేశాన్ని వీక్షించారు. పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ శ్రేణులు, అభిమానులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

**పార్టీ బలోపేతానికి కృషి**

రానున్న రోజుల్లో జనసేన పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటామని పార్టీ నాయకులు తెలిపారు. చీరాల నియోజకవర్గంలోని ప్రతి వార్డులో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులను అన్ని విధాలుగా బలపరుస్తామని పేర్కొన్నారు. పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కష్టపడి పనిచేస్తామని తెలిపారు.

కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళిక

ఈ సందర్భంగా ఆలా అనిల్ మాట్లాడుతూ.. జనసేన పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం పవన్ కళ్యాణ్ ప్రత్యేక ప్రణాళికను రూపొందించారని తెలిపారు. క్రియాశీల సభ్యత్వం తీసుకున్న ప్రతి సభ్యుడికి ప్రమాదవశాత్తు ఆపద సంభవించినప్పుడు వారి కుటుంబానికి అండగా నిలిచే విధంగా రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. కార్యకర్తల సంక్షేమంపై పవన్ కళ్యాణ్‌కు ఉన్న శ్రద్ధ, ప్రజలపై ఉన్న గౌరవం, సేవా కార్యక్రమాల పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత ప్రశంసనీయమన్నారు.
ఇలాంటి నాయకుడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి స్థాయిలో ఉంటే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మరిన్ని అద్భుతమైన కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంటుందని అన్నారు. రానున్న రోజుల్లో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆలా అనిల్, ఆలా శ్రీధర్, లక్కాకుల లక్ష్మి, వీర మహిళ పద్మినీదేవి, చక్రి, ఆర్.కె. నాయుడు, భాష, రాజా తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. చీరాల నియోజకవర్గ జనసేన పార్టీ ఐటీ సమన్వయకర్త భూపతి మనోజ్‌తో పాటు వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువకుడికి తీవ్ర గాయాలు, గుంటూరుకు తరలింపు



చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 02 :
చిలకలూరిపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన టాటా ఏసీ వాహనం స్కూటర్‌ను బలంగా ఢీకొనడంతో నాదెండ్ల గ్రామానికి చెందిన కిరణ్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందిన వెంటనే 108 సిబ్బంది ఈఎంటీ దేవదానం, పైలట్ రవితేజ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం కిరణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు

## ఇంజనీరింగ్ విద్యార్థి అదృశ్యం

### చెరువు కట్టపై లభ్యమైన బ్యాగు, చెప్పులు



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 02 :**
పట్టణంలోని స్థానిక మంచినీళ్ల చెరువు వద్ద ఇంజనీరింగ్ విద్యార్థి అదృశ్యమైన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం పల్లెమల్లి గ్రామానికి చెందిన గంపినేని అభిలాష్ (21), గుంటూరులోని ప్రైవేట్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతూ చిలకలూరిపేట ఎన్టీఆర్ నగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం బంధువుల శుభకార్యానికి వెళ్లి వచ్చిన అతను అకస్మాత్తుగా కనిపించకుండా పోయాడు. ఈ క్రమంలో చెరువు వద్ద పనులకు వెళ్లిన మున్సిపల్ సిబ్బందికి గట్టుపై అభిలాష్‌కు చెందిన బ్యాగు, చెప్పులు, పుస్తకాలు, ఆధార్ కార్డు కనిపించడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, గజఈతగాళ్ల సాయంతో చెరువులో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. చేతికందిన కొడుకు జాడ తెలియకపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇది ప్రమాదమా లేక మరేదైనా కారణమా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## హజ్-2027 యాత్రికులకు వైద్య పరీక్షలు



**విజయవాడ,పెన్ పవర్,సెప్టెంబర్ 2:**
హజ్-2027 యాత్రకు తాత్కాలికంగా ఎంపికైన యాత్రికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మెడికల్ స్క్రీనింగ్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్ భాష కోరారు.ఈ మేరకు ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యాన్‌కు లిఖితపూర్వకంగా వినతిపత్రం అందించినట్లు ఆయన తెలిపారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా జారీ చేసిన సెప్టెంబర్ 1, 2026 సర్క్యులర్ నంబర్ 10 ప్రకారం తాత్కాలికంగా ఎంపికైన ప్రతి యాత్రికుడు తప్పనిసరిగా మెడికల్ స్క్రీనింగ్ అండ్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు.
రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో తాత్కాలికంగా ఎంపికైన యాత్రికులకు నిర్ణీత నమూనాలో వైద్య పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు జారీ చేసేలా జిల్లా వైద్య ఆరోగ్య అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. నిర్ణీత గడువులోగా పరీక్షలు పూర్తి చేసి, సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.హజ్ యాత్రికులు ఎలాంటి ఆలస్యం చేయకుండా గడువులోగా వైద్య పరీక్షలు పూర్తి చేసుకుని ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలని షేక్ హసన్ భాష సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టితో హజ్ యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సహకరించాలని ఆయన కోరారు.

